క్లుప్తంగా

ధర్మవరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం నివాళి అర్పిస్తున్న మంత్రి వనిత, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

కొవ్వూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వల్లే మనందరం స్వేచ్ఛ, స్వాతంత్య్రాలతో జీవించ గలుగుతున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి మంత్రి ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె అన్నారు. విగ్రహ దాత కాళ్లకూరు బుజ్జి, ఆయన స్నేహితులను మంత్రి అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంపాటి సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరపట్ల శ్రీనివాస్, కాళ్లపాలెం బుజ్జి, బోడపాటి కేశవదేవరాయులు, రాధా రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్టు సభ్యులు, జలాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఐ.పంగిడిలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడిలో మాజీ ఉప సర్పంచ్ తోట దుర్గారావు, కోమటి సతీష్ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్–2023 ఈనెల 24 నుంచి ప్రారంభం అవుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న ఆదివారం వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 20 లోగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.33,333, ద్వితీయ బహుమతిగా రూ.22,222 నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్ ఆఫ్ ది సిరీస్, అత్యధిక సిక్సులు కొట్టిన వారికి సిక్సర్స్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందజేస్తామన్నారు.

బాలిక వైద్యానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని శింగరాజుపాలేనికి చెందిన దళిత బాలిక కొమరపు శ్రీనివాస్ కుమార్తె జయశ్రీ (4) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతోంది. ఆ పేద కుటుంబం మందుల ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతోంది. జయశ్రీ వ్యాధి గురించి, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న జన సైనికులు ఆ కుటుంబానికి తమకు తోచిన సాయం చేశారు. ఆ బాలిక కుటుంబానికి శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించామని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి దుర్రా శ్రీను తెలిపారు.

పశువుల పాక దగ్ధమై గేదె మృతి

గోపాలపురం: మండలంలోని రాజంపాలెంలో ప్రమాదవశాత్తూ ఆదివారం తెల్లవారుజామున పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఆ గ్రామ రైతు చెల్లింకుల రామకృష్ణకు చెందిన గేదె కాలి చనిపోయింది. రోజూ మాదిరిగానే శనివారం సాయంత్రం రామకృష్ణ తన పొలంలోని పాకలో గేదెను కట్టి ఇంటికి వచ్చేశాడు. తెల్లవారుజామున పాక దగ్ధం కావడంతో ఒళ్లంతా కాలిపోయిన గేదె చనిపోయింది. ఆ గేదె ఖరీదు సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్, లేక ఎవరైనా పాకకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఆయన భావిస్తున్నారు. దీనిపై ఆయన గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడి పందేలపై దాడి: 10 మంది అరెస్టు

నల్లజర్ల: మండలంలోని నల్లజర్ల, పోతినీడుపాలెం గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. నల్లజర్లలో 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8,640, ఐదు వాహనాలు, ఏడు సెల్ ఫోన్‌లు, ఒక కోడిపుంజు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పోతినీడుపాలెంలో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,660, రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి అద్దె అడిగినందుకు గాయపరిచాడు

కొవ్వూరు: ఇంటి అద్దె బకాయి చెల్లించమని అడిగిన యజమానిపై అద్దెకు ఉంటున్న వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం ప్రకారం కొవ్వూరులో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పైడి శ్రీరాములునాయుడి ఇంట్లో మూడేళ్లుగా గొర్రిపాటి శ్రీను అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. ఏడాదిగా అతడు అద్దె చెల్లించడం లేదు. తన అద్దె బకాయి వెంటనే చెల్లించాలంటూ శ్రీరాములు నాయుడు అతడిని ఆదివారం నిలదీశాడు. దీంతో ఆగ్రహం చెందిన గొర్రిపాటి శ్రీను ఒక్కసారిగా శ్రీరాములు నాయుడిపై దాడి చేయడంతో రక్తపు గాయం అయ్యింది. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ చెప్పారు.

మట్టి ఇటుకకు గట్టి రేటు

- వెయ్యి ఇటుకల ధర రూ.7 వేలు
- నిర్మాణదారులకు భారం
- దృఢత్వానికి మారుపేరుగా తాళ్లపూడి ప్రాంత ఇటుక



తాళ్లపూడి మండలంలో ఓ బట్టీలో తయారైన ఇటుక



ప్రక్కిలంక వద్ద తయారు చేసిన పచ్చి ఇటుక

తాళ్లపూడి: మట్టితో తాళ్లపూడి మండలంలో తయారు చేసే ఇటుకలకు నాణ్యతపరంగా మంచి పేరుంది. ఈ ప్రాంత ఇటుక దృఢత్వానికి మారు పేరుగా చెబుతారు. కాగా కొద్ది రోజులుగా మట్టి ఇటుక ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఇటీవల జోరందుకున్నాయి. దాంతో పాటు భవన నిర్మాణాలు కూడా బాగా పెరగడంతో ఇటుకకు డిమాండ్ ఏర్పడింది. సాధారణంగా ఏటా ఈ సీజన్‌లో ఇటుక రేట్లు తగ్గుతాయి. అందుకు భిన్నంగా ఈ ఏడాది వాటి ధరలు స్థిరంగా కొనసాగుతుండడం నిర్మాణదారులకు భారంగా మారింది. ప్రస్తుతం వెయ్యి ఇటుక రేటు రూ.6500 పైనే పలుకుతోంది. అదనంగా రవాణా చార్జీలను భరించాలి.

దృఢత్వానికి మారు పేరు...

తాళ్లపూడి మండలంలో తయారయ్యే ఇటుకకు ఇతర ప్రాంతాల్లో కూడా డిమాండ్ ఎక్కువ. ఇక్కడి ఇటుక దృఢత్వానికి పెట్టింది పేరని నిర్మాణదారుల నమ్మకం. అందుకే మండలం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకే కాదు, ఇతర జిల్లాలకు, ఏకంగా హైదరాబాద్‌కు కూడా నిత్యం ఇటుకలు ఎగుమతి అవుతాయి. ఈ ప్రాంతంలో నల్లరేగడి మట్టి, జిగురుమట్టితో పచ్చి ఇటుకలు తయారు చేస్తుంటారు. కొన్ని రోజుల పాటు ఎండలో ఆరిన తర్వాత ఆ పచ్చి ఇటుకలను బట్టీపై పేర్చి వంట చెరకు, బొగ్గు, ఊకతో కాలుస్తారు. అందువల్ల ఇవి మరింత ధృడంగా తయారవుతాయి. వెయ్యి ఇటుకల రేటు 1000 సైజును బట్టి రూ.6500 నుంచి రూ.7000 వరకూ పలుకుతోంది. తాళ్లపూడి మండలంలో సుమారు గతంలో సుమారు 40 వరకూ ఇటుక బట్టీలు ఉండేవి. ప్రస్తుతం 10 బట్టీలు మాత్రమే నడుస్తున్నాయి. ఇక కొవ్వూరు, చాగల్లు మండలాల్లో సుమారు 15 వరకూ బట్టీల్లో ఇటుక తయారు చేస్తున్నారు.

తగ్గని ఇటుక ధరలు ..

ఏటా నవంబర్ నుంచి జూన్ నెల ప్రారంభం వరకు ముమ్మరంగా ఇటుకల తయారీ జరుగుతుంది. ఈ కాలంలో వర్షాలు కురిసే అవకాశం తక్కువ కాబట్టి. ఈ సమయంలోనే ఇటుక ధరలు నిర్మాణదారులకు కాస్తంత అందుబాటులోకి వచ్చేవి. అయితే ఈ ఏడాది మాత్రం ప్రారంభం నుంచి హెచ్చు ధరకే అమ్ముతున్నారు. బట్టీల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు మరింత పెంచేశారని ఆరోపణ. అలాంటిది ఏమీ లేదు, ముడి సరుకుల ధరలు, కూలీల రేట్లు పెరిగాయి కాబట్టి గిట్టుబాటు కావడం లేదని బట్టీల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో సామాన్య, మధ్య తరగతి వర్గాల వారు ఇల్లు కట్టాలంటేనే హడలిపోతున్నారు. సుమారు ఒక్కో ఇంటికి పెద్ద సైజు ఇటుక 25 వేల నుంచి 30 వేల వరకూ అవసరం. ఈలెక్కన రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ కేవలం ఇటుకకే ఖర్చవుతుంది. బట్టీల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు ఇటుక బట్టీల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ధర పెరగడం మాకు భారం

నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాను. ఇటుక ధరలు పెరగడంతో నిర్మాణదారులపై అదనపు భారం పడుతోంది. గతంలో మట్టి ఇటుక రేటు తక్కువగా ఉండేది. ప్రస్తుతం వెయ్యి ఇటుక రేటు రూ.7 వేలకు చేరింది. మట్టి ఇటుక అయితే గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ధర తగ్గితే బాగుంటుంది.



– ఎస్ పార్వతి, అన్నదేవరపేట

తయారీ ఖర్చులు పెరిగాయి

గతంతో పోలిస్తే ఇటుక తయారీకి ఇటీవల కూలీలు, ఇతర ఖర్చులు భారీగా పెరిగాయి. కూలీలు దొరకడం లేదు. ఊక, బొగ్గు, వంట చెరకు తదితర ముడి సరుకుల ధరలు పెరిగాయి. ఇతర నిర్వహణ ఖర్చులు కూడా పెరగడంతో మరో మార్గం లేక ఇటుక ధర పెంచాల్సి వచ్చింది.



– పి గంగాజలం, బట్టీ నిర్వాహకుడు, ప్రక్కిలంక

సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయాలి

చాగల్లు: వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధుల వంటి వారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య అన్నారు. ఆదివారం బ్రాహ్మణగూడెం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కొవ్వూరు పర్యటనకు అధిక సంఖ్యలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 12న కలవలపల్లి, నెలటూరులలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.ముఖ్య అతిథిగా హోం మంత్రి తానేటి వనిత హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, ఎంపీటీసీ సభ్యులు ఉసురుమర్తి జ్యోతి, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ మూల వెంకటరమణ, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉండవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు

నిడదవోలు రూరల్: మండలంలోని ఉనకరమిల్లిలో సీతారాముల కల్యాణ 81వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంతో ఈ గ్రామస్తులు ఎక్కడ ఉన్నా ఈ వేడుకకు తరలి వస్తారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వారం రోజులుగా పండగ వాతావరణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాములను దర్శించుకుని పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. సూరాపురం, డి.ముప్పవరం గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

జనం నినాదం.. జగనన్నే మా భవిష్యత్తు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- తిమ్మాపురంలో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్ ఆవిష్కరణ
- గ్రామాల్లో ఇంటింటికీ గృహ సారథులు, వలంటీర్లు



ద్వారకాతిరుమలలో ఓ ఇంటి వద్ద మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక అర్హులందరికీసంక్షేమ పథకాలు అందుతున్నాయని.. భవిష్యత్తులోనూ మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతి ఇంటా కోరుకుంటున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)తో కలసి ఎమ్మెల్యే తలారి ఆదివారం సాయంత్రం తిమ్మాపురంలో 'జగనన్నే మా భవిష్యత్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సొంత ఖర్చుతో వాల్‌పోస్టర్లు వేయించిన సచివాలయ కన్వీనర్ ఆచంట బన్నును అభినందించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే తలారి ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంట స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ రావాలని, అందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని పందలపర్రు, కాటకోటేశ్వరం, పెండ్యాల, కంసాలిపాలెం, విజ్జేశ్వరం, రావిమెట్ల, సమిశ్రగూడెం గ్రామాల్లో ఆదివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి మా నమ్మకం నువ్వే జగన్ డోర్, సెల్‌ఫోన్ స్టిక్కర్లను లబ్ధిదారుల ఆమోదంతో వారి ఇంటి గోడలకు అంటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచులు కారింకి అన్నవరం, తిక్కా శ్రీనివాస్, కొండపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షులు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, మలిశెట్టి వీరప్రసాద్, కోసూరి అప్పారావు, యాళ్ల రామారావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోపవరం గ్రామంలోని సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు నివాసం వద్ద మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. జగనన్నే మా నమ్మకం పోస్టర్లను ఆ ఇంటి గుమ్మాలకు గృహ సారథులు అతికించాలన్నారు. మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే వల్లీ, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉంగ్రాజవరం: జగనన్నే మా భవిషత్తు కార్యక్రమాన్ని మండలంలోని పసలపూడిలో నిర్వహించారు. మండల గృహసారథుల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు సారథ్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్ళి ఈ కార్యక్రమం గురించి ప్రజలకు వివరించి, జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి, చామర్తి తమ్మిరాజు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్ పాల్గొన్నారు. కాల్దారిలో వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, గుణ్ణం రవికుమార్‌లు, చిలకపాడులో పింద్ర పోసేశ్వరరావు, సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి తదితరులు జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇక దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ, తాడిపర్రులో కరుటూరి వెంకటేశ్వరరావు ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఉంగ్రాజవరంలో వైస్ ఎంపీపీ ఎన్.సరోజ, సర్పంచ్ మెండే వెంకట్రావు, బీఎస్సార్ యూత్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమం నిర్వహించారు.

కొవ్వూరు: పట్టణంలోని 14వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లతో కలసి వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవా ధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ చీర అరుణకుమారి, పార్టీ ఇన్‌చార్జ్ యాసారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిడదవోలు మండలం పెండ్యాలలో పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు



గోపాలపురం మండలం గోపవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ తదితరులు



ఉంగ్రాజవరం మండలం పసలపూడిలో ..

క్రీస్తు పునరుత్థాన జ్ఞాపకం ఈస్టర్



కొవ్వూరు క్రిస్టియన్ శ్మశానవాటిక వద్ద ఈస్టర్ వేడుకల్లో చైర్‌పర్సన్ రత్నకుమారి,రాజేష్ దంపతులు



రాగోలపల్లిలో తల్లి సుశీలమ్మ సమాధికి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, కుటుంబ సభ్యులు



ఉంగ్రాజవరంలో సమాధుల వద్ద సర్పంచ్ మెండే వెంకట్రావు, గాడి కృస్టఫర్ తదితరులు

- హోం మంత్రి తానేటి వనిత
- పూర్వీకుల సమాధుల వద్ద క్రైస్తవుల ప్రార్థనలు

కొవ్వూరు: శిలువపై ఏసుక్రీస్తు మరణాన్ని, సమాధి నుంచి పునరుత్థానాన్ని గుర్తు చేసుకునే పవిత్రమైన రోజు ఈస్టర్ అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఈస్టర్ పండగ సందర్భంగా కృపా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని సమాధుల తోటలో నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరూ ఇక్కడకు వచ్చి గతించిన తమ పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఆకుల కనకప్రసాద్ ప్రార్థనలు నిర్వహించారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, కౌన్సిలర్ చీరా అరుణకుమారి, బత్తి నాగరాజు, మాజీ కౌన్సిలర్ భావన రాజేష్(బెన్ని), వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: శ్మశాన వాటికలలోని తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేయించి పూలతో సుందరంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. అక్కడే కొద్ది సేపు తమ వాళ్లకోసం ప్రార్థనలు చేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తల్లి సమాధి వద్ద మంత్రి వనిత నివాళి

తాళ్లపూడి: మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని రాగోలపల్లిలోని తన తల్లి జొన్నకూటి సుశీలమ్మకు మంత్రి తానేటి తానేటి వనిత, ఆమె కుటుంబ సభ్యులు ఈస్టర్ సందర్భంగా ఆదివారం నివాళి అర్పించారు. తమ స్వగ్రామం రాగోలపల్లిలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు భార్య, హోం మంత్రి వనిత తల్లి అయిన సుశీలమ్మ, వారి పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు. పాస్టర్లు ప్రార్థనలు చేశారు. మంత్రి తండ్రి బాబాజీరావు, సోదరి సునీత, సోదరుడు కుమార్, కుటుంబ సభ్యులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఎం.దొరబాబు, నాయకులు సిర్రా గంగారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలోని గోదావరి మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద డైరెక్టర్ టి.జాన్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగ నిర్వహించారు. తాళ్లపూడి సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలోను, ప్రక్కిలంక చర్చిలోను, పైడిమెట్ట ఏపీ ఫానియా లూథరన్ చర్చి వద్ద ప్రార్థనలు చేశారు. మలకపల్లి చర్చిలో సీహెచ్ఎస్ స్పర్జన్‌బాబు ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.

చాగల్లు: గౌరిపల్లి క్రీస్తు కల్వరి ప్రేమ ప్రార్థనా మందిరంలో విశ్వాసులకు సంఘ కాపరి యు.ఇశ్రాయిలు ప్రభువు సందేశాన్ని వినిపించారు. ఈస్టర్ సందర్భంగా మండలంలోని చర్చిల్లోను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆత్మీయులకు విందు ఇచ్చారు. క్రీస్తు పునరుత్థానాన్ని తెలుపుతూ ఆదివారం ఉదయాన్నే క్రైస్తవులు ఆయా చర్చిల ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేశారు. ఎస్.ముప్పవరం ఆర్‌సీఎం చర్చి, చాగల్లులోని బైబిల్ మిషన్, పెంతెకోస్తు, బెరాకా, ఆర్‌సీఎం, జీడీఎం, నెలటూరు సెయింట్ జాన్ లూథరన్, మల్లవరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల, చంద్రవరం గ్రామాల చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: పట్టణంలోని కృపాధార లూథరన్ చర్చి, రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చి, ఆర్సీఎం, బైబిల్ మిషన్, మండలంలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ పండగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను రంగురంగుల పూలతో అలంకరించారు.కొవ్వొత్తులు వెలిగించారు. ప్రార్థన మందిరాల్లో క్రీస్తు పునరుత్థానం విశిష్టతపై దైవజనులు వాక్యోపదేశాలు చేశారు. సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, కలవచర్ల, రావిమెట్ల, తాడిమళ్ల గ్రామాల ప్రధాన మందిరాల్లో విశ్వాసులు ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ప్రేమ విందులు ఏర్పాటు చేశారు.

ఉంగ్రాజవరం: ఉంగ్రాజవరంలోని క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించారు. వారి ఆత్మలకు శాంతి చేకూర్చమంటూ ఏసుక్రీస్తును ప్రార్థించారు. ఈ వేడుకలో ఉంగ్రాజవరం సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్టఫర్ పాల్గొన్నారు. అనంతరం గ్రామాల్లో సువార్త ర్యాలీలు నిర్వహించారు.

దోమల మందు పిచికారీ

కొవ్వూరు: మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఆధ్వర్యంలో జనసేన కార్యకర్తలు ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జన సైనికులు స్ప్రేయర్స్ భుజాన వేసుకుని పలు వీధుల్లో కొద్ది సేపు మందు పిచికారీ చేశారు. జనసేన నాయకులు గంద్రోతు పవన్, సిద్దా మురళి, చిరంజీవి, కాపవరం ఎంపీటీసీ సభ్యుడు ఎలుబండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Wanted Male Faculty
Dr. SRK & KSR Junior & Degree College Nallajerla
English, Physics, Botany, Chemistry, Zoology, Computers & Commerce.
Send Resume to College
Whatsapp: 98499 75620
Cont : 98493 97497

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com